మహిళల ఆర్థిక పరిపుష్టికి ప్రభుత్వం కృషి

- ముున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి
- 9 గ్రూపులకు వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ

జంగారెడ్డిగూడెం: ప్రతి మహిళా ఆర్థిక పరిపుష్టి సాధించేందుకు అన్నగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. జంగారెడ్డిగూడెంలో మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆసరా చెక్కును ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ లక్ష్మి మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా స్వయం సహాయ సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతను అందిస్తోందన్నారు. మహిళ ఆర్థికంగా ఎదిగితే అది సమాజానికి మేలు చేస్తుందని, రాష్ట్ర అభివృద్ధి వాటాలో మహిళల ప్రాధాన్యత పెరిగితే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. ఈ ఆలోచనతోనే మహిళల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. మహిళలను ప్రాధాన్యత క్రమంలో మొదటిగా నిలబెట్టి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాల పట్ల మహిళలు సైతం సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చైర్‌పర్సన్ అన్నారు. అలాగే సంక్షేమ పథకాల విషయంలో ఏ ఒక్క లబ్ధిదారుడు మిగిలిపోకూడదన్న జగన్‌మోహన్‌రెడ్డి కృతనిశ్చయానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు కూడా కృషిచేస్తున్నారని, దీనికి నేడు 9 డ్వాక్రా గ్రూప్‌లకు వైఎస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ నిదర్శనం అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో వైఎస్సార్ ఆసరాకు సంబంధించి 732 గ్రూపులు అర్హత కలిగి ఉండగా, వీటిలో ఇప్పటి వరకు 723 గ్రూపులకు మూడు విడతలలో రూ. 24,24,75,000 లబ్ధిదారుల గ్రూప్ పొదుపు ఖాతాల్లో జమ చేశారన్నారు. అయితే మిగిలిన 9 గ్రూపులకు సంబంధించి వివిధ సాంకేతిక కారణాలతో మూడు విడతల సొమ్ము జమ కాలేదని, దీనిని గుర్తించిన అధికారులు విషయాన్ని ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలియజేయడంతో, సాంకేతిక సమస్యలను పరిష్కరించి సదరు 9 గ్రూపులకు గురువారం వైఎస్సార్ ఆసరా చెక్కును అందజేయడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో మూడు విడతల సొమ్ము రూ.30,49,979 లబ్ధిదారుల పొదుపు ఖాతాల్లో జమ అయినట్లు వివరించారు. వైస్‌చైర్మన్ ముప్పిడి అంజి, వైఎస్సార్ సీపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు పీవీఎస్ చంద్రరావు, చిటికెల అచ్చిరాజు, ఉగ్గం ప్రసాద్, బత్తిన చిన్న, కనమతరెడ్డి బాబూరావు, కమిషనర్ పి.భవానీ ప్రసాద్, మెప్మా సిబ్బంది నాగమణి, రాధ తదితరులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయంలో ఆసరా చెక్కును పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

క్లుప్తంగా

దొరమామిడిలో పర్యటించిన అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ

బుట్టాయగూడెం: గిరిజన ప్రాంతమైన దొరమామిడిలో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం రాష్ట్రంలోని మోడల్ కేంద్రంగా ఉండటం అభినందనీయమని అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ పి.శ్రీపూజ అన్నారు. బుట్టాయగూడెం ఇన్‌చార్జి ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న ఆమె దొరమామిడిలో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి అక్కడ చెత్త సేకరణ, సంపద తయారీ విధానాన్ని సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల పరిషత్ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ తరువాత గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయాన్ని సందర్శించారు. సర్పంచ్ తెల్లం రాముడు, ఈటీపీఆర్‌డీ ఎం. శ్రీహరి, కార్యదర్శి ముప్పిడి బొజ్జమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

కొయ్యలగూడెం: బయ్యనగూడెం విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నట్లు సంఘ పెద్దలు తెలిపారు. అధ్యక్షుడిగా చింతలూరి శ్రీను, కార్యదర్శిగా కలవగంటి శ్రీను, కోశాధికారిగా కలవగంటి దుర్గారావు, ఉపాధ్యక్షులుగా కలవగంటి కోట సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా లింగగిరి రామకృష్ణ, సహాయ కోశాధికారిగా లింగగిరి వీరాచార్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు గురువారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. గుంటూరు జిల్లా దుగ్గిరాలకు చెందిన బొద్దులూరి సాంబశివరావు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ గోపీనాథ్ విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఆడమిల్లి విద్యార్థులు



రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కామవరపుకోట: రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్, బేస్ బాల్ పోటీలకు ఆడమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.విజయభారతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పెదవేగి ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్ పాఠశాలలో జిల్లా స్థాయిలో నిర్వహించిన సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ జాతీయ స్కూలు గేమ్స్‌లో సాఫ్ట్‌బాల్‌లో తమ విద్యార్థులు ఎస్‌కే పైజానవల్లి, కె.హారిక బేస్‌బాల్ పోటీలలో సీహెచ్ నాగసాయి, ఆర్.మౌనిక విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీడీ మానుకొండ సుబ్బారావును ప్రధానోపాధ్యాయులు విజయభారతి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కొయ్యలగూడెం: జిల్లాస్థాయి బేస్ బాల్, సాఫ్ట్ బాల్ పోటీలకు అండర్–14 బాలికలు విభాగంలో తమ పాఠశాలకు చెందిన ఎ.భవిత, కె.రోహిత్, సత్యా విద్యాబాల ఎంపికయ్యారని గవరవరం గ్రామానికి చెందిన వెంకటపతి రాజు విద్యాసంస్థల అధినేత సుభద్రాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో గురువారం పెదవేగి జూనియర్ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో ఈ ఎంపికలు చేశారని వివరించారు. అండర్–17 విభాగంలో బాలికల నుంచి కె.సిరిచందన, పి.మోక్షిత, పి.దివ్య పావని, బాలుర నుంచి పవన్ కిషోర్, సాయి గోపీచంద్ ఎంపికయ్యారన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను జయప్రదం చేయండి

చింతలపూడి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ డా బి రాంబాబు నాయక్ ఆదేశించారు. మండలంలోని యర్రగుంటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశం గురువారం పీహెచ్‌సీ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా ఆసుపత్రి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సభ్యులు చర్చించారు. ఆసుపత్రి సిబ్బందికి, ఏఎన్‌ఎంలకు డ్రైడే, ఫ్రైడే కార్యక్రమాల అమలుపై సూచనలు చేశారు. జెడ్పీటీసీ ఎం.నీరజా సుధాకర్, పీహెచ్‌సీ వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ జ్యోతి

జంగారెడ్డిగూడెం రూరల్: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ కొదమ జ్యోతి అన్నారు. జంగారెడ్డిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. శానిటేషన్ పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. డ్రెయినేజీలను, మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకును పరిశుభ్రంగా ఉంచాలన్నారు. దోమల నివారణ చర్యలు కొనసాగించాలని, ఫీవర్ సర్వే నిర్వహించి జ్వరాలతో ఇబ్బందులు పడుతున్న వారికి వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. ఎంపీడీవో కె.విజయ్ ప్రసాద్ మాట్లాడుతూ చల్లవారిగూడెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో జ్వరాలతో ఇబ్బందులు పడుతున్న వారికి వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రమేష్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గణపతిబప్పా మోరియా..

ద్వారకాతిరుమల: గణపతిబప్పా మోరియా.. నినాదాలు ద్వారకాతిరుమల క్షేత్ర పురవీధుల్లో మారుమోగాయి. డప్పు వాయిద్యాలు.. డీజే సౌండ్ల హోరు.. చిత్రవిచిత్ర వేషధారణలు.. యువకుల నృత్యాల నడుమ గురువారం గణేష్ నిమజ్జనం ఎంతో అట్టహాసంగా జరిగింది. స్థానిక గుడిసెంటర్‌లో నెలకొల్పిన గణనాథుని నిమజ్జనను ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు క్షేత్ర పురవీధుల్లో గణేషుడ్ని ఊరేగించారు. ఈ సందర్భంగా శక్తి వేషధారణలు, యువకుల సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాత్రి పంగిడిగూడెంలోని పోలవరం కాలువలో గణేష్ నామస్మరణల నడుమ నిమజ్జనను ఘనంగా జరిపారు. అలాగే క్షేత్రంలోని చెరువు వీదిలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు భారీ అన్నసమారాధనను నిర్వహించారు.

కొయ్యలగూడెం: మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో గణనాథుల విగ్రహ నిమజ్జనోత్సవ కార్యక్రమాలు గురువారం ఘనంగా నిర్వహించారు. అంకాలగూడెంలో ఐదవ వార్షికోత్సవ సందర్భంగా ఘంటా వారి వీధిలో నెలకొల్పిన విగ్రహాన్ని వైభవంగా ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నసమారాధన చేశారు. రేపల్లెవాడ రామాలయం వద్ద ఏర్పాటుచేసిన గణపతి ఉత్సవ శిబిరంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. స్వామివారి ఊరేగింపు శుక్రవారం నిర్వహించనున్నారు.

టి.నరసాపురం: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం మండలంలో గణేష్ విగ్రహాల నిమజ్జనోత్సవాలు నిర్వహించారు. ప్రధానంగా మండల కేంద్రమైన టి.నరసాపురంలో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహం ఊరేగింపులో విచిత్ర వేషధారణలు ఆకట్టుకున్నాయి.



ద్వారకాతిరుమలలో ఎడ్ల బండి ఆకారంలో ఉన్న వాహనంలో ఊరేగుతున్న గణేషుడు



ద్వారకాతిరుమలలో డీజే సౌండ్ల నడుమ యువత సందడి



కొయ్యలగూడెం మండలం అంకాలగూడెంలో వినాయక ఊరేగింపు



టి.నరసాపురంలో ఊరేగింపులో ఆకట్టుకున్న విచిత్ర వేషధారణ

ఎమ్మెల్యే తలారికి వినతి

ద్వారకాతిరుమల: తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించి జీతాలను పెంచాలని కోరుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు గురువారం గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావుకు వినతిపత్రాన్ని అందించారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకాతిరుమల మండలాలకు చెందిన తాము ఈ వినతి పత్రాన్ని అందజేసినట్టు ఫీల్డ్ అసిస్టెంట్లు తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే తలారి సానుకూలంగా స్పందించారని, ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో సీఎం వైఎస్ జగన్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తానని హామీ ఇచ్చారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ నియోజకవర్గ అధ్యక్షుడు మహేష్, వసంతాటి శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఏర్పాటు

జంగారెడ్డిగూడెం: ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జంగారెడ్డిగూడెం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు కూన పాముల విఘ్నేష్ గురువారం ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద జరిగిన యూనియన్ సమావేశంలో నూతన కార్యవర్గం ఏర్పడిందన్నారు. యూనియన్ అధ్యక్షుడిగా కొత్తూరి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా ఇంగుర్తి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా బొక్కా శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడుగా జేవీ రమణరాజు, సహాయ కార్యదర్శిగా సోమయాజుల వీర ప్రసాద్, కోశాధికారిగా కొత్తూరి శ్రీనులను ఎన్నుకున్నారు.

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

చింతలపూడి: మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తొర్లపాటి బాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా గురువారం నగర పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులు నల్ల రిబ్బన్‌లు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తొర్లపాటి బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులు, ఇంజినీరింగ్ కార్మికులు, ఆఫీస్ సిబ్బందిని తక్షణం క్రమబద్ధీకరించాలని కోరారు. కార్మిక నాయకులు వెలగాడ అనురాధ, శ్రీరామ్ పార్వతి, కోటయ్య, పొదిలి చిన్నయ్య, మార్తమ్మ, నారాయణ, దేవానందం తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రం మంజూరుపై హర్షం

సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల: మెట్టప్రాంతమైన గోపాలపురం నియోజకవర్గానికి అగ్నిమాపక కేంద్రాన్ని మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కృతజ్ఞతలు తెలిపారు. శాసన సభ సమావేశాలు గురువారం ప్రారంభం కాగా తొలిరోజు జరిగిన సమావేశాల్లో ఎమ్మెల్యే తలారి మాట్లాడారు. గోపాలపురం నియోజకవర్గంలో ఎక్కువగా పొగాకు, మొక్కజొన్న, ఆయిల్‌పామ్, వరి పంటలు పండుతున్నాయన్నారు. అయితే తరచూ అగ్నిప్రమాదాలు సంభవించి పొగాకు బేరన్‌లు దగ్ధమౌతున్నాయని, దీని వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని గత అసెంబ్లీ సమావేశాల్లో సీఎం దృష్టికి తీసుకెళ్లానన్నారు. దాంతో అగ్నిమాపక కేంద్రాన్ని మంజూరు చేసిన సీఎంకు ఎమ్మెల్యే తలారి ముందుగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన ప్రసంగాన్ని కొనసాగిస్తూ గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తాడిపూడి లిఫ్ట్ మెయిన్ కెనాల్ నుంచి 2, 3, 5 లిఫ్టలను నియోజకవర్గంలో ఏర్పాటు చేశారన్నారు. అయితే 2, 3 లిఫ్టలు బాగానే పనిచేస్తున్నాయని, దీని ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందుతోందన్నారు. దేవరపల్లి మండలం బందపురం వద్ద 5వ లిఫ్ట్‌కు 2008లో వైఎస్సార్ రూ. 54 కోట్లు నిధులను విడుదల చేశారన్నారు. ఆ సబ్‌లిఫ్ట్ ద్వారా దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం మండలాల్లోని సుమారు 12 వేల ఎకరాలకు సాగునీరు అందుతోందన్నారు. అప్పట్లో ఆ లిఫ్ట్ కోసం 200 ఎకరాల భూమిని రైతుల నుంచి కొనుగోలు చేసి, వారికి పూర్తి స్థాయిలో పరిహారాన్ని కూడా చెల్లించారన్నారు. సేకరించిన భూమిలో పంట కాలువలను కూడా తవ్వారన్నారు. ఈ లిఫ్ట్ ద్వారా 4 ఏళ్ల క్రితం నీటిని విడుదల చేసినప్పటికీ, నీరు సక్రమంగా పారడం లేదన్నారు. సబ్‌లిఫ్ట్, మెయిన్ కెనాల్‌తో పాటు, పంట కాలువలు కొన్ని పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేసి, సమస్యను పరిష్కరించాలన్నారు. అలాగే నల్లజర్ల మండలం పోతవరం గ్రామంలో 2018లో సీతమ్మ ఆవ(బ్యారేజ్) అకాల వర్షాల కారణంగా కొట్టుకుపోయిందన్నారు. అయితే దాని నిర్మాణానికి అప్పట్లో రూ. కోటిన్నరతో అంచనాలు రూపొందించారన్నారు. కానీ అది ముందుకు కదల్లేదన్నారు. దీని వల్ల 2 వేల ఎకరాల్లో భూములు బీడువారాయన్నారు. ఆవ నిర్మాణానికి రూ. 2 కోట్లు విడుదల చేసి, సమస్యను పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా గోపాలపురం, కొవ్వూరు, నిడదవోలు నియోజకవర్గాల మీదుగా వెళ్లే కొవ్వాడ కాలువ ద్వారా గోపాలపురం, దేవరపల్లి మండలాలకు సాగునీరు అందుతోందన్నారు. అయితే అది కొంత మేర ఆక్రమణలకు గురికావడం, గుర్రపుడెక్క పెరగడం వల్ల వరదనీరు పంట పొలాల్లోకి వస్తోందన్నారు. కాలువలు పూడిక తీస్తే, వరద ముప్పు తప్పి, సమస్య తీరుతుందన్నారు. అలాగే దూబచర్ల–ద్వారకాతిరుమల కాలినడక రహదారిని, గోపాలపురం–దొండపూడి రహదారిని, దూబచర్ల–లక్కవరం వయా జి.కొత్తపల్లి రహదారిని నిర్మించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు.



అసెంబ్లీలో సమస్యలపై మాట్లాడుతున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

జ్వరాల తీవ్రతపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం

ఐటీడీఏ పీఓ సూర్యతేజ

కుక్కునూరు: మండలంలోని పలు గ్రామాల్లో జ్వరాల తీవ్రతపై స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నట్టు ఐటీడీఏ పీఓ ఎం సూర్యతేజ చెప్పారు. మండలంలో జ్వరాల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో ఆయన డీఎం అండ్‌హెచ్‌ఓ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో, తహసీల్దార్, ఎంపీడీఓలతో కుక్కునూరులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న సురక్షతో పాటుగా ప్రభుత్వం తరపున అందిస్తున్న వైద్యసేవలను తెలియపరిచేలా వలంటీర్‌లను ప్రతి ఇంటికి పంపి చైతన్యపరచాలని అధికారులకు సూచించారు. అనంతరం కివ్వాక గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. గత ఏడాది గోదావరి వరదల కారణంగా ముంపునకు గురైన కుక్కునూరు పాత పీహెచ్‌సీ భవనంలో పూర్తయిన మరమ్మతు పనులను పరిశీలించి ప్రస్తుతం వైద్యశాలను నిర్వహిస్తున్న భవనం నుంచి పాత భవనానికి మార్చాలని ఆదేశించారు. అంతేకాక జిల్లా పరిషత్ హైస్కూల్ లో నాడు–నేడు పనులను, పోలింగ్ బూతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ డా.సర్మిష్ఠ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డా.మేరికేథలిన్, తహసీల్దార్ డీఎల్ ప్రమద్వర, ఎంపీడీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కుక్కునూరు పాత పీహెచ్‌సీ భవనాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ సూర్యతేజ

పీఓకు వినతిపత్రం అందజేత

కుక్కునూరు: మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కుక్కునూరు ఎంపీపీ గీతావాణి, వైస్ ఎంపీపీ తాండ్ర రాజేష్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు గురువారం ఐటీడీఏ పీఓ ఎం సూర్యతేజను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండలంలో జ్వరాల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీలలో మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేయాలని, మిగులు భూములకు సంబంధించి మార్పులు చేర్పులు చేసుకునేలా అవకాశం కల్పిస్తూ ఫ్రీజ్ చేసిన వెబ్ ల్యాండ్‌ను ఓపెన్ చేయాలని, ఆర్‌అండ్‌ఆర్ పరిహారం ఇవ్వలేదు కనుక పరిహారం అందించే వరకు పోలవరం పరిహారం చెల్లించిన భూములలో మోటార్లు ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు.

ఘనంగా గురజాడ జయంతి

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసరావు అధ్యక్షతన గురజాడ అప్పారావు జయంతి ఘనంగా నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సామాజిక మార్పుకోసం గురజాడ అప్పారావు ఎంతో కృషి చేశారని అన్నారు. కన్యాశుల్కం అనే గొప్ప నాటకాన్ని రచించడమే కాకుండా, సామాజిక దురాచారాల నిర్మూలన కోసం, తెలుగు సాహిత్య రంగ అభివృద్ధికి కృషి చేశారని అన్నారు.

చింతలపూడి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో మహాకవి గురజాడ వెంకట అప్పారావు జయంతిని గురువారం ఘనంగా జరుపుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా పి శ్రీనివాసరావు, అధ్యాపకులు గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక సీపీఎం ప్రజా సంఘాల కార్యాలయంలో గురజాడ జయంతి నిర్వహించారు. ప్రముఖ కవి మల్లెల జయరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గురజాడ సేవలను పలువురు నాయకులు కొనియాడారు.

ద్వారకాతిరుమల: గురజాడ మన తెలుగు వెలుగు జాడ అని తిరుమలంపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.సురేష్ అన్నారు. స్థానిక పాఠశాలలో గురజాడ అప్పారావు 161వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గురజాడ చిత్రపటానికి హెచ్‌ఎం సురేష్ పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం తెలుగు పండిట్ ఎం.పెద్దిరాజు గురజాడ రచనలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో తెలుగు పండిట్ రమేష్, ప్రభాకరరావు పాల్గొన్నారు.



చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

టి.నరసాపురం: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్‌పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు గురువారం టి.నరసాపురంలో రహదారి దిగ్బంధనం కార్యక్రమం నిర్వహించారు. పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి లంక జయబాబు మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ చేసి బీజేపీ మాదిగలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. ఎంఎస్‌పీ మండల ఇన్‌చార్జి నందిపాము వెంకటేష్, ఎంపీటీసీ నార్లపాటి వెంకటేష్, నార్లపాటి దుర్గారావు, రాయల పేరయ్య, ఎంఆర్‌పీఎస్ నాయకుడు బర్రె సత్యనారాయణ పాల్గొన్నారు.

కామవరపుకోట: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడితే 59 ఉప కులాలకు న్యాయం జరుగుతుందని ఎంఆర్‌పీఎస్ మండల ఇన్‌చార్జి పొద్దుటూరు వీరాంజనేయులు మాదిగ అన్నారు. గురువారం చెక్‌పోస్ట్ నుంచి బస్టాండ్ ఎదురుగా గల, అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జోసెఫ్ తంబి మాదిగ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదించాలని కోరారు.

జగనన్న శాశ్వత భూహక్కు పత్రాల అందజేత

పోలవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అందజేస్తున్నారని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అన్నారు. పోలవరం మండలం వింజరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకం కింద లబ్ధిదారులకు భూ హక్కు పత్రాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి సంక్షేమ పథకం వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇళ్లకు నేరుగా చేరవేయడం జరుగుతోందన్నారు. పింఛన్లు కూడా 1వ తేదీనే ఠంచన్‌గా అందజేయడం జరుగుతుందన్నారు. నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యంతోపాటు రైతులకు సాగు చేసుకునేందుకు అవసరమైన అన్ని వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొక్కెర వెంకటలక్ష్మి, ఎంపీటీసీ కుంజెం చిట్టెమ్మ, పంచాయతీ కార్యదర్శి వై.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



భూ హక్కు పత్రాలను అందజేస్తున్న ఎంపీపీ వెంకటరెడ్డి

బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేయాలి

కామవరపుకోట: ఎస్సీ, ఎస్టీ కేసులలో బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అన్నారు. మండలంలోని వీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన జిల్లా ఎస్సీ ఎస్టీ కేసుల విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ సభ్యులుగా ఎన్నుకోబడిన గుర్రాల రవికుమార్, గ్రామ సర్పంచ్ దేవరపల్లి రామ్మోహన్‌రావు గురువారం ఏలూరు క్యాంపు కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దళితులకి, గిరిజనులకి పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందించాలన్నారు. బాధితుల పక్షాన నిలిచి వారికి ప్రభుత్వం నుంచి అందవలసిన ఆర్థిక సహాయం అందించుటలో కృషి చేయాలని గుర్రాల రవికుమార్‌కి ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వీరిశెట్టిగూడెం వార్డు సభ్యులు ఉప్పె సూర్యేశ్వరరావు, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ సరిపల్లి రాజు, సాయిదుర్గ, వనం గోపీకృష్ణ ఆమెను కలిసిన వారిలో ఉన్నారు.



జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీని మర్యాదపూర్వకంగా కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు

వరకట్న వేధింపులపై కేసుల నమోదు

జంగారెడ్డిగూడెం: వరకట్న వేధింపులపై పలువురు మహిళలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

ఏలూరు మండలం వంగాయగూడెంకు చెందిన గంచారి శ్రీకాంత్‌కు, జంగారెడ్డిగూడెంకు చెందిన నాగేశ్వరికి జూలై 31, 2023లో వివాహమైంది. వివాహ సమయంలో కట్నంగా రూ.3 లక్షలు, 2 కాసుల బంగారం, రూ.1 లక్ష సారె కింద ఇచ్చారు. అయితే శ్రీకాంత్ అధిక కట్నం తీసుకురావాలని మానసికంగా, శారీరికంగా వేధిస్తున్నారని నాగేశ్వరి ఫిర్యాదు చేయడంతో శ్రీకాంత్, మరో ఏడుగురిపై కేసు నమోదు చేశారు.

- వేగవరానికి చెందిన బండి వీర్రాజు, లక్ష్మిలకు వివాహమై 18 ఏళ్లు అయ్యింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. చెడు వ్యసనాలకు గురైన వీర్రాజు సొమ్ముల కోసం దుర్భాషలాడుతూ మానసికంగా, శారీరికంగా వేధిస్తున్నాడని లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది.
- కుక్కల రాజు, సాయి స్నేహలకు 2019లో వివాహం కాగా వీరికి ఒక బాబు ఉన్నాడు. వివాహ సమయంలో 2 సెంట్లు భూమి, పెళ్లి ఖర్చుల కింద రూ.2 లక్షలు, అరకాసు బంగారు ఉంగరం కట్నంగా ఇచ్చారు. అయితే ఇటీవల అధిక కట్నం తీసుకురావాలని రాజు, అతని కుటుంబ సభ్యులు మరో ముగ్గురు కలిసి వేధిస్తున్నారని స్నేహ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.
- గుంజ శ్రీను, లక్ష్మిలకు 2010లో వివాహం కాగా ఆ సమయంలో రూ.5 లక్షలు కట్నంగాను, రూ.10 వేలు ఆడపడుచు లాంఛనం, నాలుగు కాసుల బంగారం ఇచ్చారు. మద్యానికి బానిసైన శ్రీను అధిక కట్నం కోసం వేధిస్తున్నాడని, అతని కుటుంబసభ్యులు మరో ఆరుగురు అతనికి సహకరిస్తున్నారని లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది.